క్లుప్తంగా

నత్తనడకన జీపీ భవన నిర్మాణం



అమరచింత: పంచాయతీ పాలన కోసం కొత్త భవన నిర్మాణానికి రూ.20 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించడంతో ఆగమేగాల మీద శిథిలావస్థలో ఉన్న పంచాయతీ భవనాలను కూల్చివేస్తూ కొత్త భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పనులు చేపట్టి ఆరు నెలల కాలం దాటుతున్నా ఇప్పటికి ముందుకు సాగడం లేదు. పంచాయతీ సమావేశాలను సైతం నిర్వహించుకునే వీలు లేక తాత్కాలిక భవనాల్లో పాలన నిర్వహించుకునే పరిస్థితి దాపురించింది. మండలంలోని మస్తీపురం, నాగల్‌కడ్మూర్‌లో నిర్మిస్తున్న పంచాయతీ భవన పనులు నత్తనడకన సాగుతున్నాయి. అధికారులు స్పందించి పనుల్లో వేగం పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

బహుమతుల ప్రదానం



పెబ్బేరు రూరల్: దసరా పండుగ సందర్భంగా మండలంలోని గుమ్మడంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. మొదటి విజేతకు రూ.20వేలు అందజేశారు. కార్యక్రమంలో వెంకట్రాంరెడ్డి, హరిబాబు, చంద్రయ్య, కృష్ణయ్య, రాముడు, నిరంజన్‌రెడ్డి పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి మృతికి సంతాపం

అడ్డాకుల: మండలంలోని పొన్నకల్‌లో పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న తిరుపతమ్మ(47) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కొన్నాళ్ల కిందట అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పగా.. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. ఆమె భర్త రమేష్ పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్నారు. గతంలో ఆమె అడ్డాకుల మండలంలోని రాచాల, రాంచంద్రాపూర్ గ్రామాల్లో కార్యదర్శిగా పని చేశారు. అంతకు ముందు మూసాపేట మండలంలోని పోల్కంపల్లి, దాసర్‌పల్లి గ్రామాల్లో కార్యదర్శిగా పని చేశారు. కాగా మహబూబ్‌నగర్‌లో నివాస ముంటుండగా ఆమె స్వస్థలం గద్వాలలో అంత్యక్రియలు నిర్వహించారు. ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, ఎంపీడీఓ మంజుల, కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది ఆమె మృతదేహం వద్ద నివాళి అర్పించి సంతాపం వ్యక్తం చేశారు.

ఆన్‌లైన్ మోసం

శాంతినగర్: గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి బండి కంతు కట్టాలని, లేని పక్షంలో మోటార్ సైకిల్ సీజ్ చేస్తామని హెచ్చరించాడు. దీంతో ఆన్‌లైన్‌లో నగదు పంపి మోసపోయిన ఘటన వడ్డేపల్లి మండలంలోని కొంకల గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. నారాయణగౌడ్ మూడేళ్ల క్రితం శాంతినగర్‌లోని షోరూంలో మోటార్‌సైకిల్ కొనుగోలు చేశాడు. ఫైనాన్స్‌లో కంతుల ప్రకారం లావాదేవీలు జరుపుతున్నాడు. ఈ క్రమంలో తాము మహబూబ్‌నగర్ నుంచి ఫోన్ చేస్తున్నామని, 7780273083 బండి కంతు చెల్లించాలని, లేదంటే సీజ్‌చేస్తామని ఒత్తిడి తేవడంతో వారు తెలిపిన 9700770567 నంబర్‌కు ఆన్‌లైన్‌లో రూ.2600 పంపాడు. రెండు మూడు రోజుల నుంచి వారు మాట్లాడిన నంబర్‌కు ఫోన్ చేస్తే ఎవరు లిఫ్ట్ చేయకపోవడంతో తాను మోసపోయినట్లు తెలుసుకున్నాడు. ఈ విషయమై శాంతినగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రాజోళి మండలంలో వేరే గ్రూపువారు రూ.40 వేలు ఇలాగే మోసం చేశారు. ఇలాంటి మోసాలకు గురికాకుండా ప్రజలు, యువకులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు తెలిపారు.

'ఉపాధి' ఫీల్డ్ అసిస్టెంటులేరి..



తెల్లరాళ్ళపల్లితండాలో చెరువులో ఒండ్రుమట్టి తొలగింపు పనులల్లో ఉపాధి కూలీలు(ఫైల్)

- నూతన పంచాయతీల్లో ఇబ్బందులు
- పంచాయతీ కార్యదర్శులు, మేటీల ద్వారా నెట్టుకొస్తున్న వైనం
- పనిభారం పెరగడంతో గగ్గోలు

పాన్‌గల్: ఉపాధి పనులకు వస్తున్న కూలీల హాజరు, పనుల గుర్తించేందుకు ప్రభుత్వం పంచాయతీల్లో ఫీల్డు అసిస్టెంట్లు నియమించింది. మండలంలో నూతన పంచాయతీల్లో సరైన ఫీల్డు అసిస్టెంట్లు లేక పంచాయతీ కార్యదర్శులు, మేటీల ద్వారా నెట్టుకొస్తున్నట్లు అధికారులు వాపోతున్నారు. దీంతో ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి నూతన పంచాయతీల్లో ఫీల్డు అసిస్టెంట్లను నియమించి ఇబ్బందులను తొలగించాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు.

మండల పరిస్థితి

మండలంలో 28 పంచాయతీలు ఉండగా వాటిలో ప్రస్తుతం కేవలం 15 మంది ఫీల్డు అసిస్టెంట్లు మాత్రమే పనిచేస్తున్నారు. మండలంలో పాత పంచాయతీలు పాన్‌గల్, మల్లాయిపల్లి, చిక్కేపల్లి గ్రామాలతో పాటు 10 నూతన పంచాయతీల్లో ఫీల్డు అసిస్టెంట్లు లేకపోవడంతో ఆయా గ్రామాల్లో ఉపాధి కూలీలకు ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలో మొత్తం 15,791 జాబుకార్డులు ఉండగా.. 5,210 కుటుంబాల్లో 7,958 మంది కూలీలు ఉన్నట్లు సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

జోరుగా పనులు

మండలంలో హరితహారంలో భాగంగా గ్రామాల్లో ప్రస్తుతం రహదారులకు ఇరువైపులా మొక్కలకు పాదులు చేసి, నీరు పట్టే పనులు గ్రామాల్లో రోజువారీగా కూలీలు చేస్తున్నారు. మండలంలో ప్రతి ఏటా సుమారుగా రూ.10 కోట్లకు పైగా విలువ చేసే పనులు జరుగుతున్నాయి. మూడు నాలుగు చోట్ల ఒకే సమయంలో పనులు జరిగితే ఫీల్డు అసిస్టెంట్లు అన్ని చోట్ల జరిగే పనులు, హాజరుపై పర్యవేక్షణకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అందుకు అధికారులు స్పందించి ఫీల్డు అసిస్టెంట్లను నియమించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పనిభారం పెరిగింది



నూతన పంచాయతీల్లో ఫీల్డు అసిస్టెంట్లు లేక పంచాయతీ కార్యదర్శి, మేటీల ద్వారా పనులు నిర్వహిస్తున్నారు. దీంతో పనులపై పర్యవేక్షణ కొరవడం, కూలీలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పాత జీపీలతో పాటు నూతన జీపీల పనుల పర్యవేక్షణతో ఫీల్డు అసిస్టెంట్లకు పని భారం పెరిగింది. అధికారులు స్పందించి నూతన జీపీలకు ఫీల్డు అసిస్టెంట్లను నియమించి ఇబ్బందులను తొలగించాలి.

– బీరయ్య, ఫీల్డు అసిస్టెంట్ల సంఘం మండల అధ్యక్షుడు, కేతేపల్లి

ఉపాధి పొందుతున్నాం



వ్యవసాయ పనులు లేనప్పుడు ఆర్థిక ఇబ్బందులు మొదలవుతాయి. సరిగ్గా అదే సమయంలో ఉపాధి పనులు కొనసాగడంతో వాటి ద్వారా ఆర్థిక వెసులుబాటు దొరుకుతుంది. మా గ్రామానికి ప్రత్యేకంగా ఫీల్డు అసిస్టెంటు లేకపోవడంతో పనుల కల్పన, కూలీల హాజరు విషయంలో కొంత ఇబ్బంది ఉంది. కాబట్టి ప్రత్యేకంగా క్షేత్ర సహాయకుడిని నియమిస్తే ప్రయోజనం ఉంటుంది.

– నర్సింహనాయుడు, రైతు, మాధరావుపల్లి.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



నూతన గ్రామ పంచాయతీల్లో ఫీల్డు అసిస్టెంట్లు లేక ఇబ్బంది జరుగుతున్న మాట వాస్తవమే. ఈ విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయాం. మారోమారు వారి దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటాం.

– కుర్మయ్య, ఏపీఓ, పాన్‌గల్

వైభవంగా బొడ్రాయి వార్షికోత్సవం



హోమం నిర్వహిస్తున్న భక్తులు



వార్షికోత్సవం సందర్భంగా సీతారాములకు ప్రత్యేక పూజలు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో బొడ్రాయి వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని కుమ్మరిగేరి ఆంజనేయస్వామి వద్ద, బజాద్దాంజనేయస్వామి దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన బొడ్రాయికి ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకం, చండీ, రాజశ్యామల హోమాలు తదితర పూజలు, సాయంత్రం బోనాల ఉత్సవాన్ని నిర్వహించారు. కుంకుమ, పసుపు, పూలు తదితర వాటితో ప్రత్యేకంగా తయారు చేసిన బోనాలలో నైవేద్యం తీసుకుని బొడ్రాయికి సమర్పించారు. ఈ ఉత్సవాల్లో గ్రామ ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యం



రామనంతాపురంలో ప్రచారం చేస్తున్న నాయకులు

కొత్తకోట రూరల్: రాష్ట్ర అభివృద్ధి ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే సాధ్యమవుతుందని జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని పాలెం, నిర్వేన్, రామనంతాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సీఎం కేసీఆర్ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన వాటిని ఖచ్చితంగా అమలు చేస్తారన్నారు. రాష్ట్రంలోని 93లక్షల మంది రేషన్ కార్డు లబ్ధిదారులకు బీమా సౌకర్యం కల్పించడంతో పాటు సౌభాగ్యలక్ష్మి కింద రూ.3వేలు, రూ.400కే సిలిండర్, రైతులకు రైతుబంధు పథకాలను అమలు చేసేందుకు కేసీఆర్ ముందుకు వస్తున్నారని, గడిచిన తొమ్మిదేళ్లలో లబ్ధిపొందిన ప్రతి కుటుంబం కేసీఆర్‌ను ఆశీర్వదించాలన్నారు. రాష్ట్రంలో దేవరకద్ర నియోజకవర్గానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మూడవ సారి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఎంపీపీ గుంత మౌనిక, చెన్నకేశవరెడ్డి, శ్రీను, ప్రశాంత్, అల్లాభాషా, అలీం తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: ఉమ్మడి మండలంలోని వెంకటాపురం, సూగూరు, నాగసానిపల్లి, బునాదిపురంలో బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.

రాష్ట్రంలో కార్పొరేట్ పరిపాలన



కొర్లకుంటలో మాట్లాడుతున్న జూపల్లి కృష్ణారావు

వీపనగండ్ల: రాష్ట్రంలో కార్పొరేట్ పరిపాలన కొనసాగుతుందని, పేద ప్రజలకు మేలు కలగాలంటే కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని మాజీ మంత్రి జూపల్లికృష్ణారావు అన్నారు. బుధవారం కొర్లకుంటలో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడారు. రైతులు, మహిళలు నిరుద్యోగులకు మేలు చేయాలన్న ఉద్దేశంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేయనుందని తెలిపారు. కార్యక్రమంలో కేతూరి వెంకటేష్, ఇంద్రకంటి వెంకటేష్, సుదర్శన్‌రెడ్డి, మోహన్, రమేష్‌గౌడ్, గోపాల్‌నాయక్, రాంబాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

చిన్నంబావి: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని జూపల్లి కృష్ణారావు అన్నారు. మండలంలోని బెక్కెంలో వివిధ పార్టీలకు చెందిన 100 మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. రాష్ట్రంలో ప్రజావ్యతిరేక పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌కు సన్మానం

మదనాపురం: మండల కేంద్రంలో బుధవారం స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఆంజనేయులు గౌడ్‌ను సన్మానించారు. ఆత్మకూర్ మండలంలో నిర్వహించే బీఆర్ఎస్ ప్రచార కార్యక్రమానికి ఆయన వెళ్తూ మార్గమధ్యలో మదనాపురం ఎంపీపీ పద్మావతి ఇంటి వద్ద టీ తాగారు. ఈ సందర్భంగా మర్యాదపూర్వకంగా ఎంపీపీతో పాటు నాయకులు వడ్డే రాముడు, రవీందర్ రెడ్డి, వెంకటేష్, కృష్ణ పూలమాల శాలువాతో సన్మానించారు.

అధ్యక్షుడిగా ఎంపిక

కొత్తకోట రూరల్: రాజ్‌పురోహిత్ హ్యూమన్ రైట్స్ అండ్ క్రైమ్ కంట్రోల్ రాష్ట్ర అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన సురేష్ సింగ్‌ను నియమించినట్లు, ఈ మేరకు ఆ జాతీయ అధ్యక్షుడు రణదీర్‌కుమార్ నియామకపత్రాన్ని అందజేశారు. తనపై నమ్మకంతో రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించిన జాతీయ అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

పాన్‌గల్: మండలంలోని శాగాపూర్ చెందిన పుట్టపాగ చిన్నరాములు హైదరాబాద్‌లో డ్రైవర్‌గా పనిచేస్తూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ మౌనిక యాదవ్ బుధవారం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. వారి పిల్లల చదువు విషయాన్ని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సాయం చేయిస్తామన్నారు. కార్యక్రమంలో తిరుపతియాదవ్, తిరుపతయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: మండలంలోని కొత్తసూగూరు చెందిన బాలకిష్టమ్మ, దండు వెంకట్రాములు అనారోగ్యంతో మృతి చెందారు. కాంగ్రెస్ నాయకులు బుధవారం మృతుల కుటుంబసభ్యులను పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.5 వేలు ఇచ్చారు. రంగాపురం చెందిన కటికల ఆంజనేయులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.10 వేలు అందజేశారు. కార్యక్రమంలో రమణ, వెంకటేష్, చందు, భానుచందర్, సాయన్న, బాలకిష్టి, ఉపేందర్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



ఖిల్లాఘనపురంలో తనిఖీ చేస్తున్న పోలీసులు



కొంకన్వానిపల్లె వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో బుధవారం ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. వాహనాల్లో నగదు, మద్యం తరలించే అవకాశం ఉందని ఎస్ఐ శ్రీహరి తెలిపారు. ఎన్నికల కోడ్ ఉన్నందున నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

అమరచింత: మండలంలోని ఆయా గ్రామాల మీదుగా వెళ్తున్న వాహనాలను తనిఖీ చేస్తున్నామని ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపారు. కొంకన్వానిపల్లె శివారులో బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి రూ.50వేల నగదు కంటే అధికంగా డబ్బులను తీసుకెళ్తున్న వారి నుంచి తగిన ఆధారాలు సేకరించి నగదును పరిశీలిస్తున్నామన్నారు.

చివరి ఆయకట్టు రైతులకు శాపం

- జూరాల భీమా కాల్వల కింద ఎండుతున్న పంటలు
- వృథా నీటిని అరికట్టడంలో అధికారులు విఫలం



తూముకుంట సమీపంలో ఎండుతున్న మినుము పంటను చూపుతున్న రైతు

వీపనగండ్ల: కృష్ణానదికి సమీపంలో ఉన్న గ్రామాల రైతులు తమ పంటలకు సాగునీరు అందక ఎండిపోతుండడంతో తీవ్ర నష్టాలలో కూరుకుపోతున్నారు. జూరాల భీమా కాల్వల కింద వేలాది ఎకరాలలో వేసిన వరి, వేరుశనగ, మినుము ఇతర పంటలు ఎండుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి గోపల్‌దిన్నె, శ్రీరంగాపూర్ రిజర్వాయర్ల నుంచి విడుదలవుతున్న సాగునీరు వృథా కాకుండా చివరి ఆయకట్టు భూములకు అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని మండలంలోని రైతులు కోరుతున్నారు.

మండలంలో ఖరీఫ్ సీజన్‌లో భీమా కాల్వ కింద 4,500 ఎకరాలు, జూరాల ప్రాజెక్ట్ కింద 3,100 ఎకరాలు వీటితోపాటు చెరువులు, బావులు, కుంటల కింద మరో 6వేల ఎకరాలలో రైతులు వరి, వేరుశనగ, కంది, మినుములు సాగు చేశారు.

చివరి ఆయకట్టు రైతుల ఇక్కట్లు

మండలంలో చివరి ఆయకట్టు గ్రామాలైన సంపత్‌రావుపల్లి, తూముకుంట, సంగినేనిపల్లి, వీపనగండ్ల గ్రామాలలో రైతులు వేసుకున్న పంటలకు సాగునీరు అందడం లేదు. తూముకుంట చెందిన మాల కాశన్న వేసిన 10 ఎకరాల మినుము పంట సాగునీరు అందక ఎండిపోతుంది. అలాగే నిరంజనమ్మ, నవీన్‌గౌడ్, నాగేష్‌గౌడ్ పంటలతోపాటు భీమాకాల్వ కింద సాగు చేసిన సంగినేపల్లికి చెందిన ఉడుత రాముడు, పసుల బక్కయ్య, సందు కృష్ణయ్యల పంటలు ఎండిపోయే స్థితికి చేరుకున్నాయి.

మరమ్మతు చేయడంతో నిర్లక్ష్యం

కాల్వలు లోతుగా తవ్వడం, మరికొన్ని చోట్ల బ్లాస్టింగ్ అవసరం ఉన్న పట్టించుకోకపోవడం కంపతార చెట్లు, జమ్ము ఏపుగా పెరిగిన వేసవి కాలంలో అవసరమైన మరమ్మతు చేయకపోవడం వల్ల కాల్వల వెంట వచ్చిన కొద్దిపాటి నీరు చివరి ఆయకట్టు రైతుల పొలాలకు వెళ్లడం లేదు. దీనికి తోడు పూర్తిస్థాయిలో లస్కర్‌లను నియమించకపోవడంతో నీరు వృథాగా కృష్ణానదిలో కలుస్తున్నా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

మినుము పంట ఎండింది



రూ.లక్షలు అప్పు చేసి 10 ఎకరాలను కౌలుకు తీసుకొని మినుము పంట సాగుచేస్తే పూర్తిగా ఎండిపోతుంది. సాగునీటి అధికారుల చుట్టూ తిరిగినా గోడు పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించకుంటే తమ కుటుంబం రోడ్డున పడుతుంది.

– మాల కాశన్న, కౌలు రైతు, తూముకుంట

నిర్లక్ష్యం వల్లే..



భీమా, జూరాల కాల్వల నిర్మాణ సమయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో చివరి ఆయకట్టు రైతుల పంటలకు సాగునీరు అందడం లేదు. పూడిక పడ్డ కాల్వల మరమ్మతు అసలు పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి పంటలకు సాగునీరు అందివ్వాలి.

– ఉడుత రాముడు, రైతు, సంగినేనిపల్లి

వర్షాభావ పరిస్థితుల వల్లే

తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల జూరాల డ్యాం నుంచి గోపల్‌దిన్నె రిజర్వాయర్‌కు రావాల్సిన నీరు రావడం లేదు. దీంతో చివరి ఆయకట్టు రైతుల భూములకు నీరు అందిచడం కష్టమవుతుంది. ఉన్నతాధికారుల ఆదేశానుసారం గోపల్‌దిన్నె రిజర్వాయర్‌లో వారబంధి విధానాన్ని వెంటనే అమలులోకి తెచ్చి పంటలకు సాగునీరు అందించేందుకు ప్రయత్నిస్తాం.

– ప్రభు, జూరాల ఏఈ, పెబ్బేరు జూరాల సర్కిల్



అడుగంటిపోయిన జూరాల కాల్వ

ఆర్టీసీ ప్రయాణికులకు ప్రత్యేక డీలక్స్ లాంజ్

- మహబూబ్‌నగర్ బస్టాండ్‌లో ఏర్పాటు



బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక లాంజ్

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సూపర్ లగ్జరీ డీలక్స్ బస్సులో ప్రయాణించేవారి సౌకర్యార్థం ప్రత్యేక లాంజ్ ఏర్పాటు చేశారు. మహబూబ్‌నగర్ బస్టాండ్ నుంచి హైదరాబాద్‌కు సూపర్ లగ్జరీ (నాన్‌స్టాప్) బస్సుల్లో చాలా మంది ప్రయాణికులు వెళ్తుంటారు. మహబూబ్‌నగర్ బస్టాండ్ నుంచి గత కొన్ని నెలల నుంచి సూపర్ లగ్జరీ బస్సుల్లో ప్రయాణించే వారి సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. దీనిని దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ అధికారులు ప్రత్యేక లాంజ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. సూపర్ లగ్జరీ బస్సు కదిలేలోపు లాంజ్‌లో కూర్చోడానికి ప్రయాణికులకు 20 కుర్చీలు, ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. త్వరలో ఆర్టీసీ ఈడీ చేతులమీదుగా త్వరలో ప్రత్యేక లాంజ్‌ను ప్రారంభించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్లు రీజినల్ మేనేజర్ శ్రీదేవి తెలిపారు. భవిష్యత్‌లో లాంజ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం మరిన్ని వసతులు ఏర్పాటు చేస్తామని ఆర్ఎం తెలిపారు.

కనుల పండువగా శోభాయాత్ర



జూరాలలో ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



అమరచింతలో చిన్నారులు, మహిళల కోలాటం

ఆత్మకూర్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని విశేష పూజలు అందుకున్న అమ్మవారిని బుధవారం రాత్రి ఊరేగింపు నిర్వహించి వీడ్కోలు పలికారు. మండలంలోని మూలమల్ల, జూరాల ఆలయాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలను పురవీధులగుండా ఊరేగించారు. ఊరేగింపులో కోలాటం, భజన, పలకలకోలు తదితర కార్యక్రమాలతో అలరించారు.

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లిలో ప్రతిష్ఠించిన దుర్గామాత, కన్యాకపరమేశ్వరి అమ్మవారి ఊరేగింపు బుధవారం ఘనంగా నిర్వహించారు.

మదనాపురం: మండల కేంద్రంలో దుర్గామాత నిమజ్జనం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధతో నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

అమరచింత: పట్టణంలో అమ్మవారి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్లపై శోభాయాత్ర నిర్వహించారు. అమ్మవారి పాటలతో పాటు బతుకమ్మ పాటలకు మహిళలు, చిన్నారులు నృత్యాలు, కోలాటం వేస్తూ అమ్మవారి శోభాయాత్రలో పాల్గొన్నారు. జగన్‌వాడ, విఘ్నేశ్వర నగర్, భవాని నగర్‌లో ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహాలను భక్తిశ్రద్ధలతో నిమజ్జనానికి తరలించారు. పట్టణంలోని కాళికామాత ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దేవీ నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి సమర్పించిన వడి బియ్యంను వండి భక్తులకు వడ్డించారు.



మదనాపురంలో..



మూలమల్లలో అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు